



# గుణపాఠం

తురగా (మోచర్ల) జయశ్యామల

"హలో! సుమిత్రగారూ! జస్ట్ వన్ మినిట్! ఏమిటంత వేగంగా వెళ్ళిపోతున్నారు?"

తలొంచుకొని చకచక నడుస్తున్న సుమిత్ర ఆ పలకరింపుకి ఆగి, తలెత్తి చూసింది.

ఎదురుగా విశ్వనాథ్.

సుమిత్ర, విశ్వనాథ్ ఒకే ఆఫీసులో పనిచేసున్నారు. ఆడ, మగ అన్న భేదంలేకుండా, చిరునవ్వులు చిందిస్తూ, అందరితోటి కలివిడిగా మాట్లాడతాడు.

తనకేసి చూసిన సుమిత్రవంక చిరునవ్వుతో చూశాడు విశ్వనాథ్. సుమిత్ర కొంచెంగా నొసలు చిట్లించి, "ఏమిటి పిలిచారు?" అనడిగింది.

"అబ్బే ఏం లేదు. అంత అర్జెంటుగా ఇంటికి వెళ్ళిపోవాలా" అనడిగాడు.

సుమిత్రకు విశ్వనాథ్ వాలకం చిరాకనిపించింది. 'ఎందుకలా నవ్వుతాడు? పైగా నడిరోడ్డు మీద నిలబెట్టి యింటికి వెళ్ళాలా నడుగుతే ఏంచెబుతుంది? ఇంటికి గాక ఎక్కడికి వెడతారు? అడిగేదేమిటో అతనికయినా అర్థమవుతోందా?' చిరాకు పైకి కన్పించకుండా జాగ్రత్తపడుతూ "మీరడిగేది బావుంది. ఆఫీసు వదలక ఇంటికిగాక ఎక్కడకి వెడతారు?" అంది.

"అవుననుకోండి. కాని, మిమ్మల్ని ఒక్కకోరిక కోరతాను. కాదనకూడదు."

ఈసారి సుమిత్ర తెల్లబోయింది. తను ఆఫీసులో చాలా రోజులుగా వర్క్ చేస్తూంది. సాధారణంగా ఉద్యోగం చేసే ప్రతి ఆడపిల్లా ఎదుర్కొనే సమస్యలే, ఎదుర్కొంటున్నది రోజూ. ఆఫీసు లోను.... బయట .... ఎన్నో రకాల చూపులు....ఆ చూపుల్లో ఎన్నో రకాల భావాలు....ఎన్నో పుల్లవిరుపు మాటలు.... మరెన్నో వంకర నవ్వులు....వీటన్నిటినీ అధిగమించి, ఒక్కో రోజు వెనక్కు తొయ్యడం బ్రహ్మ ప్రళయమే అవుతూంది. ఆడపిల్ల ఉద్యోగం చేస్తూందంటేనే అసులు....హేళనలు.... ఎప్పుడు మారుతుందో ఈ వ్యవస్థ?

సుమిత్ర మాట్లాడకుండా ఏదో ఆలోచిస్తున్నట్లుగా వుండడం చూసి, "చెప్పండి. మీ కభ్యంతరం కాదంటే చెబుతాను!" అన్నాడు విశ్వనాథ్.

సుమిత్ర నవ్వింది సన్నగా. "మీరు అసలువిషయం చెప్పడంలేదు....!"

"మాట తీసుకోకుండా చెబితే మీరు కాదంటారేమోనని...."

"అంటే కోరరాని కోరిక కోరుతున్నారన్నమాట....!" ఈసారి నవ్వింది సుమిత్ర.

"మీరు భలే నవ్వుతారండి!" అనేసి నాలిక్కరుచుకున్నాడు విశ్వనాథ్.

సుమిత్ర సీరియస్‌గా చూసింది. "చూడండి! మీరడగదలుచుకున్నదేమిటో అడిగెయ్యండి. నేను తొందరగా వెళ్ళాలి"



తురగా ( మోచెర్ల ) జయశ్యామల

"అదిగో! మీరు అప్పుడే సీరియస్‌గా అయిపోయారు. మాటిస్తే...."

సుమిత్రను పూర్తిగా చిరాకావరించింది. 'ఏమిటీ మనిషి' అనుకుంటూ-"మీరు అనవసరంగా తాత్సారం చేస్తున్నారు. మీరడిగేదేమిటో తెలియకుండా, మాటివ్వమంటే ఎలా కుదురుతుంది! ఒకవేళ చెయ్యలేని పరిస్థితి ...."

"అదిగో! మీరలా అనవద్దు. మీ రొప్పుకుంటానంటేనే చెబుతాను"

సుమిత్రలో కోపం రాజుకొంది. విశ్వనాథ్ అంటే ఆ క్షణంలో అసహ్యం వేసిందికూడా వచ్చే పోయే వాహనాలతో, మనుష్యులతో రోడ్డంతా సందడిగా వుంది. శీతాకాలం అవడం వల్ల అప్పుడే లోకాన్ని చిరుచీకట్లు అలుముకుంటున్నాయి. ఎంత తొందరగా అతనిని వదిలించుకుంటే. అంత మంచి అనుకున్న సుమిత్ర, "చెప్పండి, ఏమిటో?" అనడిగింది.

"మీరు... మీరు విశ్వశాంతి హోటల్‌కి నాతో టికి రావాలి!"

ఆశ్చర్యంగా చూసింది కళ్ళు పెద్దవి చేసి, "ఏం! ఏమైనా విశేషమా? ప్రమోషనొచ్చిందా? లేక బర్త్‌డే పార్టీయా?"

"ఏమీలేదు. వూరికే సరదాగా మీతో వెళ్ళాలని వుంది. అందుకని!" తడుముకోకుండా చెప్పాడు విశ్వనాథ్.

లోలోపల ఆ ఎర్రనైపోతూనే, "విత్ ప్లెజర్...!" అంటూ అంగీకరించింది సుమిత్ర.

ఆమె అంగీకారంతో ఏను గెక్కినంత సంబరపడ్డాడు విశ్వనాథ్. ఆ ఆనందంలో మాటలు తడబడుతూంటే "థాంక్యూ! థాంక్యూ!" అన్నాడు

"నో మెన్షన్! అసలింతకీ యెన్ని గంటలకు?" ప్రశ్నించింది సుమిత్ర

"చూశారా! మీరు వొప్పుకున్నారన్న ఆనందంలో అసలు సంగతే మర్చిపోయాను. రేపు సాయంత్రం ఆఫీసు వదిలాకనే అయిదున్నరకల్లా వచ్చెయ్యండి. అసలు ఆఫీసునుంచి సరాసరి వెళదాం. మీరు అంగీకరించరేమోనని హడలి పోతూనే అడిగాను సుమండీ" విశ్వనాథ్ యింకా ఏదో చెప్పబోతూంటే మధ్యలోనే అందుకొంది సుమిత్ర

"వస్తానన్నాగా పస్తుతి మానెయ్యండి. ఇది నలుగురూ నడిచే వీధి" అంటి నెమ్మదిగా సుమిత్ర

"ఓ. కే. వరినే వెళతాను!" అంటూనే ముందుకు దూసుకుపోయాడు విశ్వనాథ్.

నవ్వుకుంది సుమిత్ర.

సుమిత్ర ముందుకు కదిలింది. నడచి యిలు చేరేసరికిబాగా చీకటిపడుతుందేమో, ఇంటి దగర తల్లితండ్రులు, అక్కయ్య కంగారుపడతారని రిక్షా బేరమాడుకొంది. రిక్షాలో ఎక్కి కూర్చున్నాక సుమిత్రకు అనేక ఆలోచనలు చుట్టుముట్టాయి.

విశ్వనాథ్ మన సత్వం విచిత్రమైంది. ఎంత సేపూ తనవైపునుంచేగాని ఎదుటి వారి గురించిగాని, వారి సమస్యల గురించి గాని ఆలోచించడు. అతనికి కాలేజీలో చదివే నాటినుంచి కూడా ఆడపిల్లల్ని వెంటేసుకొని తిరగడం సరదాట. ఇప్పటికీ తరచుగా ఆఫీసులో ఒకరిద్దరమ్మాయిలుని వెంటపెట్టుకొని సినిమాలకి షికారకి, హోటళ్ళకి తిరుగుతూనే వుంటాడు వాళ్ళకయ్యే ఖర్చంతా తానే భరిస్తాడు. అందుకని అతనివెంబడి తిరిగే అమ్మాయిలు లేకపోలేదు. తనని రెండుమూడు సార్లు డిగాడు సినిమాలకి రమ్మంటూ. తను ఖచ్చితంగా చెప్పేసింది- అటువంటివి తనకిష్టం లేదని.

ఇందులో తప్పేం వుంది. ఏదో సరదాగా 'ఎంజాయ్' చెయ్యడం కూడని సనా? ఈ రాకెట్ శతాబ్దంలో కూడా బూజు పటిన భావాలతో వుండకూడదు. అందులో మన యువతరం అసలు అటువంటివి పట్టించుకో కూడదు," అంటాడు విశ్వనాథ్.

అతని మాటలు విని సుమిత్ర నవ్వుకునేది. ఏం తెలీనటు ఎలా మాట్లాడితా

డితను. తానేదో పెద్ద ఆగర్భవాది. తానెంతో సంస్కారవంతుడు అనుకుంటాడు. తను హిమాలయా లంతెత్తు పెరిగిపోయినట్లు, మిగతా వారు పెరగనట్లు మాట్లాడతాడు.

"ఎందుకండీ! అంత భయపడతారు. మనమేం తప్పు చెయ్యడం లేదు. ఒక ఆఫీసులో పని చేస్తున్నాం. రోజులో ఎక్కువ భాగం ఆఫీసులో కలిసే వుంటాం. ఈ సంఘానికి ఎందుకు భయపడాలి మనం" అనడుగుతాడు.

అయితే అలా కల్సిమెల్సి తిరగడం వల్ల అతనికి వచ్చే నష్టమేమీ లేదు. ఆ సంగతి అతనికి తెల్సు. నష్టపోయేది, చెడుపేరు తెచ్చుకునేది అతనితో తిరిగిన ఆడపిల్లలు మాత్రమే. ఏదో సరదాగా అతనితో తిరగడం కావాలిగాని, వాళ్ళెలా నష్టపోతే అతని కేం! అతని అక్క చెల్లెళ్ళు గాని, భార్యగాని కాదుకదా? ఆఫీసులో యింత ఫార్వర్డ్‌గా మాట్లాడే విశ్వనాథ్ బ్రహ్మచారికాడు. సంవత్సరం క్రితం సలక్షణంగా వున్న అమ్మాయిని దండిగా కట్నకానుకలతోనే వివాహం చేసుకున్నాడు. అతని భార్య కరుణ మరి అందగత్తె కాదు, అనాకారీ కాదు. చూడగానె ఆకర్షించే రూపం. విశ్వనాథ్ వివాహానికి ఆఫీసులో తను స్టాఫంతా వెళ్ళారు. ఇన్ని కబుర్లు చెప్పే విశ్వనాథ్ భార్యని గురించి పొరబాటున కూడా ఒక్క మాట చెప్పడు ఎవరితో. రాకెట్ యుగంలో వున్నామని చెప్పే విశ్వనాథ్. అమ్మాయిలని వెంటేసుకుని షికార్లకి, సినిమాలకి సరదాగా తిరగాలనుకునే విశ్వనాథ్. భార్యని తను లేకుండా యింటి గడప దాటనివ్వడు. ఇంటి కెప్పుడయినా ఎవరైనా వస్తే ఆమెను పరిచయం కూడా చెయ్యడు.

ఎప్పుడో విశ్వనాథ్ చెలెలు కాలేజీలో చదువుతుండగా, ఎవరో రౌడీ చెల్లెలిని ఏదో అన్నాడని, అతనిని పట్టుకొని ఎంత చిత్తు చిత్తుగా కొట్టిందీ, జేమ్స్‌బాండ్‌లాగా తానెంత సాహసం చేసింది రకరకాలుగా వర్ణించి, వినని వాడిదే పాపమన్నట్టుగా చెబుతాడు. అటువంటిది వివాహం అయి, పరాయి స్త్రీలతో సరదాగా తిరగాలని, జల్సా చెయ్యాలనీ ఆ కోరిక లెందుకో! ఆ రోడ్డుమీద యెంతసేపు నిలబెడతాడోనని వాపోతున్న దిగాని, తనకు అతనితో వెళ్ళడమంటే యిష్టం వుండికాదు. 'ఏమయినా సరే అతనికో గుణపాఠం నేర్పాలి.' అని నిశ్చయించుకుంది సుమిత్ర. అయితే, అతనికి గుణపాఠం ఎలా నేర్పాలి, ఏ విధంగా వుండాలి, అని యిల్లుచేరే వరకు ఆలోచిస్తూనే వుంది. తీరా రిక్షాదిగి యింట్లో కాలు పెడుతుంటే ఓ మెరుపులాంటి ఆలోచన మస్తిష్కంలో మెరిసింది. 'అవును అలాగే చెయ్యాలి.' అనుకుంది ఉత్సాహంగా.

* * *

"మీరు ముందు వెళ్ళండి నేను యింటికి వెళ్ళి వస్తాను!" అంది ఆఫీసు నుంచి బయటకు వచ్చాక సుమిత్ర, విశ్వనాథ్‌తో.

"ఏం! మళ్ళీ యింటి కెందుకు?" అనడిగాడు విస్మయంగా విశ్వనాథ్.

"అబ్బే! మరేం లేదు. కాస్త నీటుగా తయారయి వద్దామని...." సుమిత్ర సన్నగా నవ్వుతూ చెప్పింది.


"సరే. సరే! అలాగే కానివ్వండి. మీకోసం అక్కడ ఎదురు చూస్తూ వుంటాను తొందరగా రండి." అంటూ చెప్పాడు విశ్వనాథ్.

సుమిత్ర "అలాగే" అంటూ తలూపుతూ వెళ్ళిపోయింది.

విశ్వనాథ్ చంద్రమండలానికి వెళ్ళి వచ్చినంత విజయ గర్వంతో కాలరు సవరించుకొని నవ్వుకొన్నాడు. సుమిత్ర కాక మరో ముగ్గురమ్మాయిలు పని చేస్తున్నారాఫీసులో. ఒకామె వివాహిత. మరో యిద్దరు అవివాహితులు. అందులో వసుంధర విశ్వనాథ్ అంటే పడిచస్తుంది. అతనెక్కడికి రమ్మంటే అక్కడకు వెడుతుంది పిలిచిందే తడవుగా. అందుకే ఆఫీసులో అందరూ ఆమెను అవహేళన చేస్తూ మాట్లాడతారు. అలాగే సుమిత్ర ఆఫీసులో చేరిన కొత్తల్లో విశ్వనాథ్ కల్పించుకొని మాటాడబోయేవాడు. సుమిత్ర అవకాశం యివ్వలేదు. విశ్వనాథ్ తనతో టీకి రమ్మనమని, పిక్చర్లకి రమ్మనమని ఆహ్వానించినా మర్యాదగానే తిరస్కరించింది. అయినా, అతను మళ్ళీ రమ్మనమని అడగటంతో అతనికో గుణపాఠం నేర్పాలని గట్టిగా నిశ్చయించుకుంది.

విశ్వనాథ్ విశ్వశాంతి హోటలు చేరుకున్నాడు కాలినడకనే. ఆఫీసునుంచి అక్కడకు చేరేసరికి పూర్తిగా అరగంట పట్టింది లోపలికి వెడుతూ 'ఈ సరికి సుమిత్ర వచ్చేసుంటుంది!' అనుకున్నాడు. చాలా పేరున్న పెద్ద హోటలు. లోపలంతా చాలా కోలాహలంగా వుంది. ఉదయం ఆఫీసుకు వెళ్ళేముందే యిక్కడకు వచ్చి ఫామిలీరూంలో రెండు కుర్చీలున్న ఓ టేబులు రిజర్వు చేయించాడు. ఆ విషయం సుమిత్రతో చెప్పాడు 'ఫలానాచోట' అని. అక్కడే ఎదురు చూస్తాను మీకోసం అనికూడా అన్నాడు.

లోపలకు అడుగు పెడుతూనే తెల్లబోయాడు ఎవరో స్త్రీ కుర్చీలో అటు తిరిగి కూర్చుంది. జడ కుర్చీ పైనుంచి వ్రేలాడుతోంది నల్లత్రాచులా. వీపు ఇటువేపు పెట్టి కూర్చోవడం వలన ఎవరయినదీ గ్రహించలేకపోయాడు. అంతలోనే అతనికి కోపం ముంచుకు వచ్చింది ఆ టేబులు ప్రత్యేకంగా తనకి కావాలని ఉదయమే చెప్పి అడ్వాన్సు కూడా యిచ్చేశాడు. యిప్పుడామెవరో వచ్చి కూర్చున్నారు. వెళ్ళి అడుగుతాను—అనుకుంటూ విసురుగా వెనక్కు తిరిగేటంతలోనే ఓ ఆలోచన వచ్చింది అతని మస్తిష్కంలో. ఒకవేళ తనకన్నా ముందే సుమిత్ర వచ్చి కూర్చుందేమో. ఆ ఆలోచన రాగానే



హుషారుగా లోపలకు అడుగుపెట్టాడు. అడుగుల చప్పుడు వినికూడా ఆమె తల తిప్పి చూడలేదు.

విశ్వనాథ్ టేబులుకి ఆ పక్కగా వచ్చి ఆమె ముఖంలోకి చూశాడు. అంతే. అదిరి పడ్డాడు షాక్ తిన్నట్లు. ఆ కుర్చీలో కూర్చున్నామె అంతే ఆశ్చర్యంతో చూసింది విశ్వనాథ్‌ని.

"నువ్వా.... నువ్వా....!" అతని మాటలు తడబడ్డాయి.

"మీరు.... మీరా?" ఆమె స్వరం తొణికింది.

"ఇక్కడికెందుకు వచ్చావు." నీరసంగా కుర్చీలో కూర్చుంటూ అడిగాడు తీక్షణంగా

అతని తీక్షణతను ఆమె గమనించనట్టే "ఉదయం మీరలా ఆఫీసుకు వెళ్ళారు-వూరినుంచి మా బావ వచ్చాడు!" సంతోషంగా చెబుతున్న భార్యను మింగేసేలా చూశాడు విశ్వనాథ్.

"బావా! ఎవడు వాడు!" కోపంగా అడిగాడు.

"అదేనండీ! మా సీతాపతి మామయ్య కొడుకు - సూర్యం. మీకు మన పెళ్ళిలో పరిచయం చెయ్యలేదూ! నన్ను చూడడానికి వూరినుంచి వచ్చాడు. మీరివాళ ఆఫీసునుంచి ఆలస్యంగా వస్తాను, ఏదో పని వుందని చెప్పారుకదా! మా సూర్యం బావకు నేనంటే చాలా ఇదిలెండి యింట్లో ఎంతసేపు కూర్చుంటాం, సరదాగా ఏ హోటలుకయినా వెళ్ళి కాఫీ తీసుకుందాం. రా కరుణా! అన్నాడు. అతనిని నిరాశ పర్చడం యిష్టంలేక...." కరుణ ఏదో చెప్పుకుపోతుంటే-

"సిగ్గులేక వెంటపడి వచ్చావు! అంతేనా?" కోపంగా ప్రశ్నించాడు విశ్వనాథ్.

"ఇందులో సిగ్గుకేముంది. రమ్మనమని పిలిస్తే వచ్చాను తప్పేం వుంది!"

విశ్వనాథ్ కోపం పట్టలేక టేబులుపై పిడికిలి బిగించి గట్టిగా కొట్టాడు. "తప్పేం వుందా? ఆ వెధవగాడి వెనుక పడి హోటళ్ళకు తిరుగుతావా? నా అనుమతి లేకుండా. పెళ్ళయిన గాడిద సరాయి ఆడవాళ్ళని వెనకేసుకుని తిరగడానికి సిగ్గు లేదా! వాడికి బుదిగెదు నీ బుద్దేమయింది. పరాయి మొగవాడి వెంటపడి తిరుగుతావా! రానీ చెబుతాను వాడి పని!" అది హోటలని కూడా మర్చిపోయి అరవసాగాడు ఆయాసపడిపోతూ ఆవేశం పొందుతూ విశ్వనాథ్.

కరుణ ఏమి మాట్లాడకుండా [illegible] వింటూ కూర్చుంది. అతనిలో [illegible] పేరుకు


ప్రతి హృదయంలోను, ప్రతి సదనంలోను
సాహితీ జ్యోతులు వెలిగించు
# 1980 సం॥రం డీలక్స్ ప్రచురణలు

### వాసిరెడ్డి సీతాదేవి

| | |
|---|---|
| ఇదీ కథ | 12-00 |
| నింగి నుండి నేలకు | 11-00 |
| వైతరణి | 7-50 |
| అందాలు-ఆడవాళ్ళు | 6-00 |
| యదార్థ గాథలు | 6-00 |

### మల్లాది వెంకట కృష్ణమూర్తి

| | |
|---|---|
| అక్షర శిల్పాలు | 8-00 |
| సముద్రపు దొంగలు | 7-00 |
| దురదృష్టవంతులు | 7-00 |
| పారిపోయిన ఖైదీలు | 6-00 |

### నందుల సుశీలాదేవి

| | |
|---|---|
| అమృత హస్తం | 9-00 |
| సరళిస్వరాలు | 8-00 |
| చిగురాకులు | 6-00 |

### పాటిబండ్ల విజయలక్ష్మి

| | |
|---|---|
| రాగ తరంగిణి | 10-00 |

### మాలతీ చందూర్

| | |
|---|---|
| గోప వనిత (మాతృక : థామస్ హార్డీ "టెస్") | 11-00 |
| మంకెన పువ్వు (మాతృక : నెథానియల్ హాథారన్ "స్కార్లెట్ లెటర్") | 11-00 |

### కావిలిపాటి విజయలక్ష్మి

| | |
|---|---|
| పొద్దు పొడుపు | 10-00 |
| పెంపుడు కొడుకు | 8-00 |
| అపశృతులు | 8-00 |

### జంపాల నాగశిరోమణి

| | |
|---|---|
| విద్యాధరి | 8-00 |

### రాచకొండ శ్రీదేవి

| | |
|---|---|
| ప్రేమమందిరం | 7-00 |

### జొన్నలగడ్డ అరుణ

| | |
|---|---|
| వెలుగు తీరాలు | 8-00 |

## త్వరలో

### మాలతీ చందూర్
రాగం-అనురాగం
ప్రణయ సౌరభం
జంట నగరాలు

### మోచర్ల జయశ్యామల
నివేదన
ఆశా సౌధాలు

### మల్లాది వెంకట కృష్ణమూర్తి
లూపికా రాణీ
బలికోరిన ఎర్రజాలు
నన్ను చంపవద్దు

### బొమ్మ హేమాదేవి
అష్టపష్టస

[illegible] పబ్లికేషన్స్ ఏలూరు రోడ్, విజయవాడ-2

పాఠకులకు
దీపావళి శుభాకాంక్షలు!



గాదంశెట్టి
వెంకట చలపతిరావు

అధ్యక్షుడు :
రోటరీక్లబ్, ఏలూరు
కార్యదర్శి :
ప. గో. జిల్లా రైస్‌మిలర్స్
అసోసియేషన్
అధ్యక్షుడు : కళాభారతి

పార్టనర్
శ్రీ సంతాన
వేణుగోపాల రైస్‌మిల్
ఏలూరు.

ఫోన్ : 1062

పోయిన సంస్కారాన్ని చూస్తోంది. అతనిలో, ఎదురుగా లేని సూర్యం యెడల కలుగుతున్న ద్వేషాన్ని చూస్తోంది. ఎదురుగా వున్న తననేం చెయ్యలేని నిస్సహాయతలో పళ్ళు పట పట లాడించడం చూస్తోంది.

"ఇంతకీ ఏడీ వాడు?" అనడిగాడు.

'వాడు - అని ఎదురుగా లేని వ్యక్తిని ఎంత అసహ్యంగా సంబోధిస్తున్నాడో!' అనుకొంది. "బయటకు పాన్‌షాపుకి వెళ్ళినట్టున్నాడు!" అంది కరుణ.

"ఎంత సేపయింది నాకుకన్పించలేదే!" విశ్వనాథ్ కంఠంలో తీవ్రత ఏమాత్రం తగ్గలేదు.

కరుణ అదేం పట్టించుకోకుండా "ఆఫీస్ నుంచి ఆలస్యంగా వస్తానన్నారు!" అంది.

"ఏం! తొందరగా అనుకోకుండా యిక్కడకు వచ్చేశానని బాధగా వుందా?" వ్యంగ్యంగా అడిగాడు. భార్యను అడిగాడే గాని తానెందుకు అక్కడకు వచ్చాడో గుర్తుకు వచ్చింది విశ్వనాథ్‌కి. చేతివాచీ చూసుకున్నాడు. ఆరవుతూంది. అంటే సుమిత్ర యింక వచ్చేస్తుంది. ఇక్కడ కరుణ కూర్చుందే! ఎలా! వచ్చేస్తుందేమో! సుమిత్ర తను యిలా హోటలుకు వచ్చామని తెలిస్తే.... పోనీ సుమిత్ర యిక్కడకు రాకుండా తనే బయటికి వెళ్ళిపోతే.... మరి ఆ సూర్యంగాడు వచ్చి ఇక్కడ కూర్చుంటాడేమో! ఛ! ఛ! వెధవ. అర్ధాంతరంగా వచ్చి ప్రోగ్రాం పాడుచేశాడు! సూర్యంమీద మండిపడిపోసాగాడు.

"అన్నట్టు మర్చిపోయాను. యిందాక నేనిక్కడకు వస్తుంటే సుమిత్ర కన్పించింది" భర్త ముఖంలోకే సూటిగా చూస్తూ అంది కరుణ.

విశ్వనాథ్ ముఖంలో రంగులు మారిపోయాయి. కరుణ వూహించినట్టుగానే.

"సుమిత్ర కన్పించిందా?" అనడిగాడు ఆత్రుతగా.

"అవును. మీ ఆఫీసులో పని చేస్తూంది కదూ! ఇదేమిటో కాగితం మీకివ్వమని యిచ్చింది!" అంటూ చేతి రుమాలులో చుట్టి పెట్టుకొన్న కాగితం తీసి భర్తకందించింది కరుణ.

విశ్వనాథ్ తొందరగా విప్పి చదివాడు.

"విశ్వనాథ్ గారికి!

ప్లీజ్! ఎక్స్‌క్యూజ్‌మీ .... నేను మీరు కోరిన విధంగా హోటలుకి రావటం లేను. స్త్రీ. పురుషులు అందులో ముఖ్యంగా అవివాహిత స్త్రీలు కల్సిమెల్సి తిరగడమనేది మన సంప్రదాయ విరుద్ధం. అలా తిరిగితే సంఘం హర్షించదు కూడా. 'సంఘంతో మనకు పనేమిటి' అని మీలాంటి వారే అంటున్నా అటువంటి అభ్యుదయానికి ముందు మీ లాంటి వారే నిరోధకులవుతున్నారు. అదిమట్టుకు నిజం. నాకు కొన్ని హద్దులు, నియమాలూ వున్నాయి. పెళ్ళి కావల్సిన మీ చెల్లెలు పర పురుషుడితో తిరగడం మీరు సహించగలరా? సహించలేరు. అది ముమ్మాటికీ నిజం. తిరిగితే తప్పేమిటీ అంటే మీ కర్థంగాని విషయం కాదనుకొంటాను. మీరు మరే ఉద్దేశ్యం లేకుండా 'సరదా'కోసమే పిలిచారనుకోండి. అయితే ఈ సంఘం మిమ్మల్ని వదిలి మమ్మల్నే వేలెత్తి చూపుతుంది. అపహాస్యం చేస్తుంది. ఎవరో అక్కర్లేదు - ఈరోజు "సరదా" కోసం మీతో వెంటతీసికెళ్ళి. రేపు ఆమె ఏదో తప్పుచేసినట్టుగా మీరే అంటారు. అంతవరకు ఎందుకు వసుంధర సంగతే చెప్పండి. ఎన్నెన్ని అపవాదులు మోస్తూంది ఆమె అందుకు కారణం మీరు కాదా?

అయినా చక్కగా భార్య వుండగా పరాయి ఆడపిల్లలతో సరదాలు తీర్చుకోవాలనే వువ్విళ్ళూరటం ఎందుకు! మీ కోసం అనుక్షణం నిరీక్షిస్తూ మీరు సరదాగా ఎక్కడికయినా తీసుకువెళితే వెళ్ళాలనుకునే మీ భార్య వుండగా ఇతర స్త్రీలపాకులాట ఎందుకు? మీ సరదాలేవో మీ భార్యతో తీర్చుకోండి. అందులో దొరికే సంతోషం, సంతృప్తి యింకెక్కడా దొరకవు. అందుకే నేను ఈ విషయం మీ శ్రీమతిగారిని కల్సుకొని చెప్పి, హోటలుకు రావడానికి ఆవిడని అంగీకరింపచేశాను. మీకు నామీద కోపం రావచ్చు. కాని, మీరు నన్నేమీ చెయ్యలేరు. యింకెప్పుడూ సరదాగా అంటూ మరే ఆడపిల్ల వెంట పడకండి. గుర్తుంచుకోండి.

సెలవ్.
సుమిత్ర."

ఆ ఉత్తరం పూర్తిగా చదివిన విశ్వనాథ్‌కి అర్థం చేసుకోవడానికి రెండు నిముషాలు పట్టింది. "అయితే.... అయితే.... సుమిత్ర, నువ్వు...." అంటూ ఆగిపోయాడు

"అవును. యిద్దరం కూడబలుక్కునే యిలా చేశాం" తొణకకుండా అంది కరుణ.

"అయితే, సూర్యం...."

"సూర్యం లేడు.... చంద్రం లేడు. మీ విషయం తెల్సుకోవడం కోసం అల్లిన కథ...." తాపీగా చెప్పింది కరుణ.